సాక్షి
విజయనగరం

శుక్రవారం । 10 । మే । 2024



గిరిజన ప్రజలకు.. మార్గం సుగమం

అడవితల్లి ఒడిలో కల్మషం లేకుండా బతుకుతున్న గిరిజనులకు వెలుగు 'దారి' కనిపిస్తోంది. - 8లో



మోసకారులను నమ్మవద్దు..

ఎన్నికల వేళ ప్రజలు ముందుకు వచ్చి మాయ మాటలు చెప్పే మోసకారులను నమ్మవద్దని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. - 8లో



వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక

నెల్లిమర్ల మండలం సతివాడ పంచాయతీ పరిధి మధుపాడలో యాదవ సామాజికవర్గ ప్రజలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. - 8లో

న్యూస్‌రీల్

విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉన్నాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు నిరంతరం అండగా ఉన్నామని, భవిష్యత్‌లో కూడా అలాగనే ఉంటామని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఏపీ విశ్రాంత ఉద్యోగుల భవనంలో గురువారం విశ్రాంత ఉద్యోగులతో సమావేశమయ్యారు. మేధావులైన విశ్రాంత ఉద్యోగులు మంచి ఆలోచన చేసి, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఓట్లు, అధికారంతో సంబంధం లేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేయగలిగిన హామీలు మాత్రమే మేనిఫేస్టోలో చేర్చి నిజాయితీను చాటుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాల నాయుడు పాల్గొన్నారు.

ఎంసీసీ నిఘా బృందాలు చురుగ్గా పనిచేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎంసీసీ నిఘా బృందాలు చురుగ్గా పని చేయాలని, వాహన తనిఖీలను ముమ్మరం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టర్ నాగలక్ష్మి గురువారం నిర్వహించిన వెబ్ కాన్ఫరెన్స్‌లో నిఘా బృందాలకు పలు సూచనలు చేశారు. ప్రచారం 11వ తేదీ సాయంత్రం 5 గంటలతో ముగుస్తుందని, 12వ తేదీన డోర్ టు డోర్ ప్రచారానికి అవకాశం ఉందన్నారు. 12, 13 తేదీల్లో అభ్యర్థుల వాహనాలకు ఆర్‌ఓ పాస్‌లు జారీ చేస్తామని చెప్పారు. ఎన్నికలకు 48 గంటల ముందు నుంచి మద్యం దుకాణాలు బంద్ చేయాలని, మద్యం, డబ్బు పంపిణీలపై గట్టి నిఘా ఉంచాలని తెలిపారు.

అవకాశాలు... ఆకాశమంత

- వచ్చే ఏడాదికల్లా భోగాపురం నుంచి విమానాలు టేకాఫ్
- 2025 నాటికి అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తి
- శరవేగంగా తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టు పెండింగ్ పనులు
- మత్స్యకారులకు ఆసరాగా చింతపల్లి తీరంలో ఫ్లోటింగ్ జెట్టీ
- రూ.4 కోట్లతో రామతీర్థం ఆలయ అభివృద్ధి
- గత టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కోదండరాముడికి కష్టాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతోనే ఆలయ పునర్నిర్మాణం
- అభివృద్ధి, సంక్షేమం జగన్ సీఎంగా ఉంటేనే సాధ్యం
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: భోగాపురం వద్ద రూ.నాలుగు వేల కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం.. రాష్ట్ర పరిపాలనా రాజధాని కానున్న విశాఖను అనుసంధానిస్తూ బీచ్ కారిడార్‌లో ఆరులైన్ల రహదారి... వీటికి ఆనుకొని 500 ఎకరాల్లో ఐటీ సిటీ... వీటన్నింటితో దూసుకుపోతున్న రియల్ ఎస్టేట్... భోగాపురం ఎయిర్‌పోర్ట్, విజయనగరానికి సమృద్ధిగా తాగునీరు అందించేందుకు సిద్ధమవుతున్న తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు... మత్స్యకారులకు భరోసాగా చింతపల్లి తీరంలో ఫ్లోటింగ్ జెట్టీ... ఇలా వచ్చిన అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఎదుగుతున్న ఫార్మా పరిశ్రమ... వీటన్నింటినీ 59 నెలల కాలంలో సాధించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే అవన్నీ సాకారమవుతాయి. ఇటు పరిపాలనా రాజధాని విశాఖకు అటు శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట పోర్టుకు మధ్య అంతర్జాతీయ విమానాశ్రయంతో అనుసంధానించే నెల్లిమర్ల నియోజకవర్గం వైపు దేశమంతా చూస్తోంది. ఈ అభివృద్ధితో పాటు సంక్షేమం కొనసాగింపు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుంది. అందుకే వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గం నుంచే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆయనతో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలు..



ఇంటర్వ్యూ సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి: మీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నెల్లిమర్ల నియోజకవర్గానికి మీరు సాధించేందేమిటి?

బడ్డుకొండ: గత 2019 సార్వత్రిక ఎన్నికల్లో మంచి మెజార్టీతో నెల్లిమర్ల ప్రజలు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించారు. వారి రుణం తీర్చుకోవడానికి మా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో నెల్లిమర్ల నియోజకవర్గాన్ని ముందంజలో నిలిపాను. ఒక్క సంక్షేమ పథకాల్లోనే డీబీటీ, నాన్ డీబీటీ కలిపి సుమారు రూ.3000 కోట్ల మేర ప్రజలకు ప్రయోజనం కలిగింది. నేను అంతకుముందు 2009 నుంచి 2014 వరకు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సుమారు రూ.650 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేయించాను. 2014 నుంచి 2019 వరకూ టీడీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం పడకేశాయి. భోగాపురం ఎయిర్‌పోర్టుకు 5 వేల ఎకరాల భూసేకరణ అంటూ చంద్రబాబు హడావుడి చేసి రైతులను రోడ్డున పడేశారు. భూసేకరణ పూర్తి చేయలేదు. కోర్టుకెక్కిన రైతులతో మాట్లాడలేదు. నిర్వాసితులు ఎక్కడివారక్కడే ఉన్నారు. అప్పటికే జిల్లాకు చెందిన అశోక్ గజపతిరాజు విమానయానశాఖ మంత్రిగా పనిచేసినా కేంద్రం నుంచి ఒక్క అనుమతి కూడా తేలేదు. అంతా అస్తవ్యస్తంగా చేసేసినా 2019 ఎన్నికలకు రెండు నెలల ముందు చంద్రబాబు ఆఘమేఘాలపై వచ్చేసి భోగాపురం విమానాశ్రయానికి టెంకాయ కొట్టేశారు. చివరకు ఆ శిలాఫలకం వేసిన స్థలంపై కూడా న్యాయ వివాదం ఉంది. అశోక్ గజపతిరాజు కూడా ఆ కార్యక్రమానికి డుమ్మాకొట్టేశారు. ఈ పరిస్థితులన్నీ చక్కదిద్ది, కేంద్రం నుంచి అనుమతులన్నీ తెచ్చాకే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విమానాశ్రయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మన జిల్లాకే చెందిన జీఎంఆర్ సంస్థ దాదాపు రూ.4వేల కోట్లతో ఈ నిర్మాణ పనులను శరవేగంగా చేస్తోంది. 2025 నాటికల్లా తొలి దశ పనులు పూర్తి అవుతాయి. భోగాపురం నుంచి తొలి విమానం టేకాఫ్ తీసుకుంటుంది. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దాదాపు రూ.వంద కోట్ల ఖర్చుతో నిర్వాసితులకు ఎక్కడా లేనివిధంగా ప్రైవేట్ టౌన్‌షిప్ మాదిరి సౌకర్యాలతో పునరావాస కాలనీలను మా ప్రభుత్వం నిర్మించింది. ఇప్పటికే చుట్టూ రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంది. విమానాశ్రయ పరిసరాల్లోనే 500 ఎకరాల్లో ఐటీ సిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. రాష్ట్ర పరిపాలనా రాజధాని కానున్న విశాఖపట్నం నుంచి విమానాశ్రయాన్ని అనుసంధానిస్తూ ఆరులైన్ల బీచ్ కారిడార్ రోడ్డు కూడా సాకారం కానుంది. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తుందనడంలో సందేహం లేదు.

సాక్షి: తారకరామతీర్థ సాగర్‌ను మీరు విస్మరించారని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలపై మీ స్పందన?

బడ్డుకొండ: తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమవడానికి కారణమే గత చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మిగులు పనుల్లో కదలిక వచ్చింది. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విమానాశ్రయ నిర్మాణ పనులతోనే వీటికి కూడా శంకుస్థాపన చేశారు. ఇప్పుడు రూ.739 కోట్ల ఖర్చుతో శరవేగంగా పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే రిజర్వాయరులో 60 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే పరుగులుపెట్టిస్తాం. విమానాశ్రయానికి, విజయనగరానికి సమృద్ధిగా తాగునీటితో పాటు నెల్లిమర్ల నియోజకవర్గంలో రైతులకు సాగునీరు అందిస్తాం.

సాక్షి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థం అభివృద్ధిలో మీ పాత్ర?

బడ్డుకొండ: రామతీర్థం ఆలయానికి పూసపాటి వంశీయులే అనువంశిక ధర్మకర్తలుగా ఉన్నా ఏ రోజూ అభివృద్ధి, భక్తులకు మౌలిక సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టలేదు. బోడికొండపై కోదండ రామాలయం 2014లో హుదూద్ తుపాను వల్ల శిథిలమైంది. మరి అప్పటి నుంచి 2019 వరకూ టీడీపీ ప్రభుత్వమే ఉంది. కనీసం దాని పునర్నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. అనాథగా వదిలేయడం వల్ల స్వామి వారి విగ్రహానికి గుర్తుతెలియని దుండగులు హానితలపెట్టారు. ఆ ఘటన చాలా దురదృష్టం. మళ్లీ అటువంటివి పునరావృతం గాకుండా మా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రూ.3 కోట్లతో కోదండ రామాలయాన్ని టీడీపీ పర్యవేక్షణలో పునర్నిర్మించింది. మరో రూ.కోటి నిధులతో కొండ దిగువ రామాలయంలో ఆధునికీకరణ పనులు చేయించింది. భక్తులకు మౌలిక వసతులను అభివృద్ధి చేసింది. ప్రత్యర్థి పార్టీల వారు అనవసర ఆరోపణలు మానేసి చర్చకు వస్తే నేను సిద్ధం.

సాక్షి: మత్స్యకారులకు తగిన భరోసా కల్పించడానికి మీ వద్ద ప్రణాళిక ఏమైనా ఉందా?

బడ్డుకొండ: నెల్లిమర్ల నియోజకవర్గంలో మత్స్యకారులు కీలకం. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం, సంక్లిష్ట పరిస్థితుల్లో ఇక్కడి నుంచి ఎక్కడెక్కడికో వలసపోయారు. అందుకే దేశ సముద్రతీరంలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా బాధితుల్లో ఇక్కడి వారు ఉంటారు. వీటన్నింటికీ పరిష్కారంగానే చింతపల్లి తీరంలో రూ.25 కోట్లతో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆరెకరాల భూమి కేటాయింపు పూర్తయింది. చేపలవేటపై ఆధారపడిన 3,944 మంది మత్స్యకారులకు ఏటా రూ.10 వేలు చొప్పున మత్స్యకార భరోసా మంజూరు చేశారు. గతంలో ప్రమాదరీత్యా ఎవరైనా మృతి చెందితే వారి కుటుంబానికి రూ.2 లక్షలు ఇచ్చేవారు. మా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచింది. వేటకు వెళ్లే బోట్లుకు రూ.6.04 పైసలు ఉన్న డీజిల్ రాయితీని రూ.9కు పెంచింది. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం పూర్తి చేయిస్తాం.

సాక్షి: ఈ ఎన్నికల్లో మిమ్మల్ని టార్గెట్ చేస్తూ ప్రత్యర్థులు చేస్తున్న ఆరోపణలను ఎలా ఎదుర్కొంటారు?

బడ్డుకొండ: సుదీర్ఘకాలం టీడీపీ నాయకులే ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం వహించినా చేసిన అభివృద్ధి గానీ, చెప్పుకోదగిన మంచి పనులు గానీ లేవు. అందుకే బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారు. వాస్తవమేమిటో ప్రజలకు తెలుసు. ఈ ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థి జనసేన నాయకురాలే. ఆమెకు నియోజకవర్గంతో అనుబంధం లేదు. అవగాహన అంతకన్నా లేదు. స్థానికులకు ఉద్యోగాలిస్తామని నమ్మించి రైతుల నుంచి చౌకగా భూములు తీసుకుని కాలేజీలు, ఐటీ సంస్థలు పెట్టారు. 20 ఏళ్లలో రూ.వెయ్యి కోట్ల ఆస్తి సంపాదించారు. స్థానికులకు వారు చేసినది శూన్యం. ఇప్పుడు మళ్లీ ఉద్యోగాలిస్తామంటూ మాయమాటలు చెబుతున్నారు. నియోజకవర్గంపై వారికెంత ప్రేమ ఉంటే కరోనా సమయంలో ఎక్కడికి వెళ్లిపోయారు? అమెరికాకు పోయారు. మేము అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ నియోజకవర్గ ప్రజలను కనిపెట్టుకొనే ఉన్నాం. మేం చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వద్దకు వెళ్లి వివరిస్తున్నాం. ఇంతకుముందు ప్రతి గ్రామంలో ప్రతి గడపకు రెండు మూడు సార్లు వెళ్లాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఇంటి తలుపు తట్టాయి. ఈనెల 13న జరిగే పోలింగ్‌లో కచ్చితంగా మాకు ప్రజలు ఆదరిస్తారనే నమ్మకం ఉంది.

దోచుకో.. దాచుకో..



పార్టీ అధినాయకుడి నుంచి గ్రామ స్థాయి నాయకుల వరకు దొరికింది దోచుకోవడం.. దాచుకోవడమే టీడీపీ సూత్రం. దీనికోసం పార్టీ అధిష్టానం పథకం రచిస్తే... కింది స్థాయి నాయకులు ఆచరిస్తారు. ప్రజాధనాన్ని జేబుల్లోకి మళ్లిస్తారు. దీనికి టీడీపీ హయాంలో సాగిన నీరు–చెట్టు పనులు, పశువుల తొట్టెల నిర్మాణాలు, సామూహిక మరుగుదొడ్లు, చెత్తసంపద సృష్టి కేంద్రాలు తదితర పనులే నిలువెత్తు నిదర్శనం. ఏ గ్రామానికి వెళ్లినా టీడీపీ నాయకుల దోపిడీకి ఇవి సాక్ష్యాలుగా కనిపిస్తాయి. ఎస్.కోట నియోజకవర్గంలో అప్పట్లో కమీషన్ల దందా జోరుగా సాగడంతో అవినీతి 'కుమారి' అన్న పదం ఇప్పటికీ కొందరు వాడుతుంటారు. సొంత ఆస్తులు కూడబెట్టుకునేందుకు ఇష్టారాజ్యంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మేధావులు, ఈ ప్రాంత పెద్దలు చెప్పే మాట.

- నీరు–చెట్టు పనుల్లో దోపిడీ
- కమీషన్ల కోసం ప్రజాధనం దుర్వినియోగం
- పాలనంతా పచ్చనేతల కోసమే..
- రూ.కోట్ల సొమ్ము జేబుల్లోకి..
- బదిలీల్లోనూ ఉద్యోగుల నుంచి డబ్బుల దందా..
- టీడీపీ దుర్వినియోగ పాలనను గుర్తుచేసుకుంటున్న జనం
- ఎస్.కోట నియోజకవర్గంలో ఏరులై పారిన అవినీతి

ఎస్.కోట నెట్‌వర్క్: ప్రజలు అధికారం కట్టబెట్టారంటే... కర్మా..వాచ.. వారి సంక్షేమం, అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలి. భవిష్యత్ తరాలు బాగుపడేలా పథకాలు రూపకల్పన చేసి అమలుచేయాలి. ప్రతి ఇంటికీ సంక్షేమం సమకూర్చగలగాలి. గడప గడపకు వెళ్లి సమస్యలు తెలుసుకోగలగాలి. దీర్ఘకాలికంగా వెంటాడుతున్న సమస్యలను అంతఃకరణ శుద్ధితో పరిష్కరించాలి. ప్రతి కార్యక్రమం ప్రజోపయోగంగా ఉండాలి. 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబు హయాంలో ప్రజాధనం దుర్వినియోగమే ప్రధానంగా పాలన సాగింది. నాయకులకు లబ్ధి కల్పించడమే లక్ష్యంగా పథకాల రూపకల్పన సాగింది. ప్రతీ పనిలోనూ రూ.కోట్లు కొల్లగొట్టి సొంత ఆస్తులు సంపాదించుకున్నారంటూ అప్పటి టీడీపీ పాలనను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. వారి హయాంలో ప్రజోపయోగకరమైన ఒక్కపనీ, పథకమూ అమలుకాలేదన్నది జనం చెప్పేమాట. దీనికి ఎస్.కోట నియోజకవర్గంలో టీడీపీ హయాంలో జరిగిన కొన్ని పనులు, రూ.కోట్లు కొల్లగొట్టిన తీరే నిలువెత్తు నిదర్శనం. అందుకే టీడీపీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ నాయకులు కోరుకుంటున్నారే తప్ప ప్రజలు కాదన్న వాదన గట్టిగా వినిపిస్తోంది.

'నీరు–చెట్టు'లో నిధుల దోపిడీ..



చిత్రంలో కనిపిస్తున్నది లక్కవరపుకోట మండలం తామరాపల్లిలోని చెరువు. నీరు–చెట్టు పనుల కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం సుమారు రూ.10 లక్షలు మంజూరు చేసింది. చెరువులో వర్షపు నీరు నిల్వ ఉండేలా మట్టితీసి గట్టును పటిష్టం చేయాలన్నది నిబంధన. ఇక్కడి నాయకులు జేసీబీలతో తవ్వి ట్రాక్టర్లతో యథేచ్ఛగా మట్టిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేశారు. అలా రూ.15లక్షల నుంచి రూ.20లక్షల సొమ్మును జేబులో వేసుకున్నారు. కొందరు రైతులు పొలాలకు వేయాలని ప్రాథేయపడినా చెరువు మట్టిని ఇవ్వకపోవడం గమనార్హం. పోతనాపల్లి, జాకేరు, కరకవలస, కొండగంగుబూడి తదితర పంచాయతీల్లో జరిపిన చెరువు పనులదీ ఇదే పరిస్థితి. ఇందులో ఎమ్మెల్యేకు కమీషన్లు దండిగా అందాయన్నది ఆయా గ్రామాల ప్రజల ప్రధాన ఆరోపణ.

ఆత్మగౌరవం ఇదేనా 'చంద్రబాబు'



'ఆత్మగౌరవ నిలయాలు'(మరుగుదొడ్లు) పేరుతో ఊరి చివర సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాల్లో టీడీపీ నేతలు కోట్లాది రూపాయలు దోచుకున్నారు. ఒక్క ఊరిలో కూడా మహిళల ఆత్మగౌరవం కాపాడిన దాఖలాలు లేవు. ఊరిచివర కట్టిన మరుగుదొడ్లకు నీరు, కరెంటు, కాపలా ఇలా ఏ సౌకర్యాలు ఇవ్వలేదు. వీటిని అలంకారగానే కట్టిన పచ్చనేతలు కోట్లలో బిల్లులు స్వాహా చేసేశారు. దీనికి వేపాడ మండలం ఆతవ గ్రామంలో ఒక్కోదానికి రూ.12వేలు వెచ్చించి నాశిరకంగా కట్టిన ఆత్మగౌరవ నిలయాలే నిదర్శనం. ఇందులోనూ అప్పటి ఎమ్మెల్యేకు వాటాలు వెళ్లినట్టు సమాచారం.

పశువుల పైసలు తినేశారు..



వేసవిలో నీటి ఎద్దడి నుంచి పశువుల్ని కాపాడుకోవాలని చెప్పిన చంద్రబాబు తమ పచ్చనేతలకు పైకం ఇచ్చేసేందుకు నీళ్లతొట్టెలు అంటూ స్కెచ్ గీశారు. సహజంగా గ్రామాలకు దూరంగా కళ్లాల్లో పశువులు ఉంటాయి. గ్రామాల్లో లలితకుమారి వర్గీయులు నచ్చినచోట నీటితొట్టెలు కట్టేసి రూ.లక్షలు స్వాహా చేశారు. వీటి వల్ల ఒక్కరోజు కూడా ప్రయోజనం చేకూరలేదు. ఇప్పటికీ గ్రామాల్లో టీడీపీ అవినీతి పాలనకు సాక్ష్యంగా ఇవి దర్శనమిస్తున్నాయి.

చి(చె)త్త శుద్ధి ఏదీ...?



చంద్రబాబు చెత్తశుద్ధి కేంద్రాలు అంటూ చిత్తశుద్ధి లేని పనులు చేసి టీడీపీ నాయకులకు ప్రజల సొమ్మును దోచిపెట్టాడు. చెత్తశుద్ధి కేంద్రాలను రూ.లక్షలు పోసి నిర్మించారు. నాటి ఎమ్మెల్యే బినామీలు వీటిని శ్మశానాలు, చెరువుల్లో, గెడ్డల్లో, ఊరి చివర ఇలా తమకు నచ్చినట్టు కట్టేసి బిల్లులు తినేశారు. ఊరికి దూరమై, చెరువుల్లో మునిగిపోయి, శ్మశానాల్లో ఉండిపోయి వీటి వినియోగం లేకుండా పోయింది. దీనికి రూ.6లక్షల ఖర్చుతో ఎల్.కోట శ్రీరాంపురం చెరువులో కట్టిన చెత్తశుద్ధి కేంద్రమే నిలువెత్తు సాక్ష్యం.

మెడాల్‌తో ధమాల్..

అన్ని వైద్య పరీక్షలు అందుబాటులోకి తెచ్చాశాం అన్న చంద్రబాబు రూ.కోట్ల కమీషన్‌కు స్కెచ్ వేశారు. ఒక్కో నియోజకవర్గంలో సీహెచ్‌సీల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించేందుకు ప్రైవేటు కంపెనీలతో ఎంఒయులు కుదుర్చుకుని, కమీషన్ బేరం పెట్టుకున్నారు. రోగులకు అవసరం ఉన్నా లేకున్నా డాక్టర్లపై ఒత్తిడి చేసి టెస్టులు రాయించేవారు. ఈటెస్టుల పేరుతో మెడాల్ లాగేసిన సొమ్ములో స్థానిక టీడీపీ పెద్దలకు వాటాలు ముట్టేవన్నది జనంమాట. ప్రభుత్వ ఖజానాను చంద్రబాబు అండ్‌కో దోచుకునే తీరు ఇప్పటికీ ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది.

ఎవరికోసం ఈ రోడ్డు?



చిత్రంలో కనిపిస్తున్నది జామి మండలం జాగరంలో ఓ టీడీపీ నేత కళ్లానికి వేసిన సీసీ రోడ్డు ఇది. లక్షల రూపాయల ఉపాధి నిధులను ఇలా దుర్వినియోగం చేశారంటూ అప్పట్లో పెద్ద ఎత్తున దుమారమే లేచింది. రోడ్డు బిల్లులో వాటా స్థానిక టీడీపీ పెద్దలకు వెళ్లడంతో సద్దుమనిగించేశారు. ఇదొక్కటే కాదు టీడీపీ నాయకుల కళ్లాలు, పొలాలకు సైతం ప్రజాధనంతో రోడ్లు వేసుకున్నారు. ఉద్యోగుల బదిలీలు, షిఫ్ట్ ఆపరేటర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి రూ.లక్షల్లో దండుకున్నారన్న అపవాదు ఉంది. పదేళ్ల కోళ్ల పాలనలో ఎస్.కోటలో ప్రతి పనిలోనూ కమీషన్లు రాబట్టి ఆస్తులు కూడబెట్టారన్న విమర్శలు ఉన్నాయి.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

- ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టీవీ గిరి


టీవీ గిరి, ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్

విజయనగరం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణా సంస్థల్లో (ఐటీఐ) 2024 సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తిగల విద్యార్థులు జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవాలని విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టీవీ గిరి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఐటీఐ. ఏపీ.జీవోవీ.ఐఎస్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అనంతరం వచ్చిన యునిక్ నంబర్‌తో ఈ నెల 10వ తేదీ నుంచి వారికి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటీఐకి వెళ్లి ఒరిజినల్ ధ్రువపత్రాలు చూపించాలన్నారు. అభ్యర్థులు ఏ జిల్లాలోనైనా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో యూనిక్ సంఖ్యతో ధ్రువపత్రాలు పరిశీలన చేయించుకున్న అభ్యర్థులే కౌన్సిలింగ్‌కు అర్హత సాధిస్తారన్నారు. వెల్డర్, ప్లంబర్ ట్రేడ్‌లలో ప్రవేశాలకు 8వ తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు.. మిగతా ట్రేడ్‌లకు పదో తరగతి ఉత్తీర్ణత సాధిచిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ సమయంలో అభ్యర్థులు ఆధార్ అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో ఐటీఐ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అభ్యర్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, జెండర్ ఈ నాలుగు అంశాలు పదో తరగతి మార్కుల జాబితాలోనూ, ఆధార్ కార్డులోనూ ఒకే విధంగా ఉండాలన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి – బొండపల్లి గ్రామాల మధ్య గల రైలుపట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గురువారం గుర్తించి రైల్వే పోలీసులకు తెలియజేశారు. వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకుని రైలు ఢీ కొనడంతో మృతి చెంది ఉంటాడని భావించి, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయసు సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 94906 17089, 90000 52651 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పిడుగుపాటుతో మహిళ ..


సత్తెమ్మ (ఫైల్)

వంగర: మండల పరిధిలోని బంగారువలస గ్రామానికి చెందిన బౌరోతు సత్తెమ్మ (55) గురువారం పిడుగుపాటుతో మృతి చెందింది. బంగారువలస, రాజులగుమ్మడ గ్రామాల మధ్య బారికబంద ఆయకట్టు పొలంలో సత్మెమ్మ పనులు చేస్తుండగా... ఒక్కసారిగా పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త గంగరాజు, ఇద్దరు పిల్లలున్నారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్ అన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల ఏర్పాట్లపై పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాల సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో గురువారం ఆయన సమీక్షించారు. 13వ తేదీన జరిగే పోలింగ్‌కు సామగ్రి పంపిణీ, రవాణా, రూట్లు తదితర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి లోపాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. హింసాత్మక సంఘటనలకు తావులేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ నిబంధనలు తు.చ తప్పక పాటించే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య శిబిరం నిర్వహించాలని, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవి ఫ్లూయిడ్స్ తదితర మందులు ఉంచాలని సూచించారు. వైద్య శిబిరం వద్ద ఒక ఏఎన్ఎం, ఆశ కార్యకర్త విధుల్లో ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ పూర్తి చేసుకుని తిరిగి వచ్చి సామగ్రి అప్పగించే సమయంలో నిర్దేశిత ఫారాలు, సామగ్రిని ఖచ్చితంగా తనిఖీ చేసి తీసుకోవాలని, స్ట్రాంగ్ రూంలలో ఈవీఎంలు భద్రపరచడంలో జాగ్రత్తలు వహించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంట్ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్ శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి జి కేశవ నాయుడు, కంట్రోల్ రూం ఇన్‌చార్జ్, ఎస్‌డీసీ ఆర్.వి సూర్య నారాయణ, ఏడు శాసన సభ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹153	₹276	₹286


నాడు: మారిక గిరిజన గ్రామానికి దారి


నేడు : మారిక గ్రామానికి వేస్తున్న రహదారి

గిరిజన ప్రజలకు.. మార్గం సుగమం

- కొండల మీదకు రూ.కోట్ల ఖర్చుతో రోడ్లు
- దశాబ్దాల కల సాకారం
- డోలీ కష్టాలకు చెక్

శృంగవరపుకోట: అడవితల్లి ఒడిలో కల్మషం లేకుండా బతుకుతున్న గిరిజనులకు వెలుగు 'దారి' కనిపిస్తోంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాలు వారి ఇంటి తలుపు తట్టడమే కాదు... అటవీ ఉత్పత్తుల తరలింపునకు అనువుగా 'మార్గం' సుగమమవుతోంది. అభివృద్ధి, సంక్షేమ పాలన చేరువైంది. ప్రతీ గిరిజన గ్రామం ప్రగతి బాట పట్టింది. విద్య, వైద్య సదుపాయాలు చేరువయ్యాయి. డోలీ మోతలు దూరమయ్యాయి.

---- దారపర్తికి దారి ఇదిగో.. ------

ఎస్.కోట మండలం దారపర్తి పంచాయతీలో గిరిశిఖర గ్రామానికి గతంలో రోడ్డు సదుపాయం లేదు. అత్యవసర వేళ డోలీ మోతలే గతి. గిరిజనుల డోలీ కష్టాలపై పత్రికల్లో పలు కథనాలు ప్రచురితమైనా ఒక్క నాయకుడు కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటువంటి పరిస్థితుల్లో 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిపుత్రుల కష్టాన్ని గుర్తించి దబ్బగుంట నుంచి పల్లపుదుంగాడ వరకు రూ.4.89 కోట్లతో బీటీ రోడ్డును మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దారపర్తి పంచాయతీలో కొండపైన ఉన్న ఎనిమిది గ్రామాలకు కాలినడకన వెళ్లాల్సిందే. ప్రాణాల మీదికి వస్తే డోలీ మోసుకుంటూ మైదాన ప్రాంతానికి చేరుకోవాల్సిన దుస్థితి. అటువంటి గ్రామాలకు కూడా రోడ్లు వేయడంతో నేడు ఆటోలు, ట్రాక్టర్లు, టిప్పర్లు వంటి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పనులు పూర్తయితే రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని గిరిజనం సంతోషంగా చెబుతున్నారు. అలాగే మండలంలోని బొడ్డవర పంచాయతీ పరిధి బొడ్డవర – చిట్టంపాడు రోడ్డులో కొండపైన ఉన్న గిరిసీమల కోసం వైస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 10.75 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆయా గ్రామాల్లో రహదారి సౌకర్యాలు కల్పించనున్నారు.


నాడు: దబ్బగుంట నుంచి పల్లపుదుంగాడకు వెళ్లే కొండదారి ఇలా..


నేడు: దబ్బగుంట నుంచి పల్లపుదుంగాడకు వెళ్లే రహదారి

మా కష్టాలు తీరుతాయి



దబ్బగుంట నుంచి పల్లపుదుంగాడ రోడ్డు పూర్తయితే మా కష్టాలు తీరుతాయి. నిత్యావసర కొనుగోలుకు గాని, ఇతర ఏ అవసరాలకు మైదాన ప్రాంతానికి రావడానికి గతంలో చాలా ఇబ్బందులు పడ్డాం. ఇకమై ఆ కష్టాలుండవు. రోడ్డు ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– జన్ని సీతయ్య, పల్లపుదుంగాడ, ఎస్.కోట మండలం

గిరిజనుల కష్టాలు గుర్తించారు..



ఎస్.కోట ఎమ్మెల్యే నడుచుకుంటూ కొండమీదికొచ్చి మా ఇబ్బందులను గుర్తించారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అటవీశాఖ అనుమతులు లేవని ఇబ్బంది పెడితే ప్రభుత్వంలో మాట్లాడి అనుమతులు సాధించారు. రోడ్డు పూర్తయితే గిరిసీమలు అభివృద్ధి చెందుతాయి.

– జరతా గౌరీష్, ఏపీ గిరిజన సంఘ డివిజన్ బాధ్యుడు, దారపర్తి గ్రామం, ఎస్.కోట మండలం

పదేళ్ల తర్వాత పనులు..



మారిక రోడ్డుకు పదేళ్ల కిందట పనులు ప్రారంభించి రెండు కిలో మీటర్ల రోడ్డు వేశారు. ఫారెస్ట్ వాళ్లు అడ్డుచెప్పడంతో పనులు ఆగిపోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మళ్లీ పనులు చేస్తున్నారు. రోడ్డు పూర్తయితే మా కష్టాలు తీరుతాయి.

– కిల్లో ఆనందరావు, మారిక గ్రామం, వేపాడ మండలం

మా తలరాతలు మారుతాయి..



ఇక్కడ పుట్టి ఇక్కడే పెరిగి కొండల్ని వదిలేసి కిందకి రాలేం. ఎవరికైనా ప్రాణాల మీదికొస్తే డోలీ తప్పనిసరి.. నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి మైదాన ప్రాంతానికి రావడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఇకపై రోడ్డు పూర్తయితే మా తలరాతలు మారుతాయి.

– పాతపోయిన దేముడు, పాతమారిక గ్రామం, వేపాడ మండలం.

---- మారుతున్న మారిక తీరు..------

వేపాడ మండలం కరకవలస పంచాయతీ పరిధిలోని గిరిశిఖర గ్రామం మారిక. 2012–13లో 10.60 కిలోమీటర్ల రోడ్డు కోసం రూ. 5 కోట్లు మంజూరు చేయగా.. వెంటనే రెండు కిలోమీటర్ల మేర రోడ్డు వేశారు. ఇంతలో మహానాయకుడు రాజశేఖరరెడ్డి మరణానంతరం ఆ పనులు ఆగిపోయాయి. తర్వాత టీడీపీ పాలనలో ఎవ్వరూ మారిక ఊసెత్తలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మారిక విషయం వెలుగులోకి వచ్చింది. పాలకులు నిధులు మంజూరు చేయించడంలో సఫలీకృతులు కావడంతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు పూర్తయితే పాత మారిక, కొత్త మారిక గ్రామాల తీరు మారడం ఖాయం.

----- పట్టించుకోని టీడీపీ నాయకులు -----

అటవీ శాఖ అనుమతుల పేరుతో మారిక రోడ్డు పనులు నిలిచిపోతే టీడీపీ నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదు. అలాగే దారపర్తి రోడ్డుకు కూడా అటవీ శాఖ అనుమతులు నిరాకరించడంతో స్థానిక ఎమ్మెల్యే పట్టుబట్టి అధికారులతో మాట్లాడి అనుమతులు సాధించారు. దీంతో రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

మోసకారులను నమ్మవద్దు..


ఆకులపేట వద్ద ఎంపీ బెల్లానకు హారతిస్తున్న మహిళలు

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ఎన్నికల సమయాల్లో ప్రజలు ముందుకు వచ్చి మాయమాటలు చెప్పే మోసకారులను నమ్మవద్దని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని రెడ్డిపేట, కుమ్మరికాలనీ, హడ్కోకాలనీ, వంగపల్లిపేట, కొత్త అగ్రహారం, జి.అగ్రహారం, ఆకులపేట, తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించి, ఉపాధి వేతనదారులతో మాట్లాడారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా బొత్స సత్యనారాయణను, ఎంపీ అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. ఎంపీ బెల్లానకు మహిళలు హారతులు పడుతూ, విజయ తిలకం దిద్ది ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక


నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ పంచాయతీ పరిధి మధుపాడలో యాదవ సామాజికవర్గానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. బుధవారం రాత్రి సతివాడలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు సమక్షంలో వారంతా వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుకున్నారు. గ్రామానికి చెందిన దువ్వు లక్ష్మమప్పడు, నర్సింగరావు, పీతల తాత, నౌడగం సన్యాసి, జయరాం, బమ్మిడి గౌరి, తదితర కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ ఎటువంటి తారతమ్యం లేకుండా సంక్షేమాన్ని అందజేశామని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, మండలాధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఎల్.కోట యువత..

కొత్తవలస: మండలంలోని అర్థాన్నపాలెం గ్రామ సమీపంలో గల ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో ఎల్.కోటకు చెందిన యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. విశ్వనాథ రాంబాబు, అల్లం హరి, సంఘం హరి, సి.సునీత్‌రాహుల్, చిక్కాల నవీన్, తదితర 20 కుటుంబాలకు చెందిన యువకులు జెడ్పీటీసీ సభ్యురాలు తూర్పాటి వరలక్ష్మి, మాజీ సర్పంచ్ జేడీకే అప్పలరాజు, శ్రావణ్‌కుమార్, నీటిసంఘ మాజీ అధ్యక్షుడు జామి అప్పలరాజుల నేతృత్వంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే కడుబండి వీరందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కొత్తవలస మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ కొట్యాడ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ జామి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


కొత్తవలస: ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలోకి చేరిన ఎల్.కోట యువత

పోలీసుల డేగకన్ను

- ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి రూ. 1.15 కోట్ల నగదు సీజ్
- రూ. 8.32 కోట్ల విలువైన 99 కిలోల బంగారం, వెండి స్వాధీనం
- లక్షలాది రూపాయల మద్యం సీజ్
- ఎన్నికలకు మూడు వేల మందితో పటిష్ట బందోబస్తు

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ యంత్రాంగం డేగకన్నుతో ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి నేటి వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో తలమునకలై ఉన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 17వేల మందిపై సెక్షన్ 107, 110 సీఆర్‌పీసీ కింద బైండోవర్ కేసులు నమోదు చేసింది. జాతీయ రహదారులపై ఎక్కడికక్కడ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు రూ. కోటీ 15 లక్షల 97 వేల నగదు సీజ్ చేసింది. అదేవిధంగా రూ. 8 కోట్ల 32 లక్షల 55 వేల విలువైన 99 కిలోల బంగారం, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రూ. 61 లక్షల విలువైన 17వేల 686 లీటర్ల మద్యం.. రూ. 30 లక్షల విలువైన 611 కిలోల గంజాయిని సీజ్ చేశారు. అదేవిధంగా పీడీఎస్ రైస్, గుట్కా వంటి వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడిన 59 మందిపై కేసులు నమోదుచేశారు.


వాహన తనిఖీలు చేపడుతున్న విజయనగరం డీఎస్పీ గోవిందరావు

మూడు వేల మంది బందోబస్తు

ఇదిలా ఉంటే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు మూడువేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్పీ ఎం. దీపిక తెలిపారు. పోలింగ్ రోజున 144 సీఆర్‌పీసీ అమల్లో ఉన్నందున ఇద్దరు కంటే ఎక్కువ వ్యక్తులు గుంపులుగా ఉండరాదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 1015 గ్రామాల్లో ఎన్నికల సమావేశాలు.. 149 గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహించినట్లు చెప్పారు.

స్త్రీ, పురుష నిష్పత్తిలో తేడా తగ్గించాలి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: స్త్రీ, పురుష నిష్పత్తిలో తేడాలను తగ్గించేందుకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు తెలిపారు. సమాజంలో రుగ్మతలను తలెత్తకుండా ఉండాలంటే స్త్రీ, పురుష నిష్పత్తి సమానంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. లింగ నిర్ధారణను అరికట్టాలని, వీటికి పాల్పడే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి ఉప అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భస్థ పిండ ప్రక్రియ చట్టం – 1994 అమలుపై చర్చించారు. ప్రోగ్రాం అధికారులు స్కానింగ్ సెంటర్లను విధిగా తనిఖీ చేయాలని సూచించారు. ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఎల్‌ఓ డాక్టర్ కె. రాణి, డీఐఓ డాక్టర్ రాణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ, ఘోషా ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణశుభశ్రీ, డాక్టర్ సుజాతదేవి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలక్ష్మి , నేచర్ సంస్థ ప్రతినిధి కృష్ణారావు, డెమో చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఉన్న ఎస్‌వీఎస్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బెటాలియన్ కమాండెంట్ గౌతమిషాలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వరకు బోధించేందుకు ఇంగ్లిష్, సైన్స్ సబ్జెక్టుల్లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆరు నుంచి పదోతరగతి వరకు బోధించేందుకు బయాలజీ, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుల్లో రెండు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ లోపు దరఖాస్తుతో పాటు బయోడేటా, విద్యార్హత పత్రాలను జత చేసి పాఠశాలలో అందజేయాలని కోరారు. ఇంకా మరింత సమాచారం కోసం ప్రధానోపాధ్యాయుడు టి.అప్పారావు (సెల్: 95731 84185)ను సంప్రదించాలన్నారు.

చంద్రబాబు సభకు జనం కరువు

- బాబును హెలీప్యాడ్ వద్దే వెయిట్ చేయించిన నాయకులు
- టీడీపీ అధినేత ప్రసంగిస్తుండగానే వెనుదిరిగిన ప్రజలు

చీపురుపల్లి: సార్.. కొంచెం ఆగండి.. ఇంకా జనం పూర్తిగా చేరుకోలేదు.. అందరికీ ఫోన్‌లు చేస్తున్నాం, వచ్చేస్తున్నారు.... అంటూ స్థానిక టీడీపీ నేతలు బతిమాలడంతో హెలీప్యాడ్ వద్దనే ఉన్న బస్సులోనే చంద్రబాబు దాదాపు 40 నిమిషాలు ఉండిపోవాల్సి వచ్చింది. ఇదీ టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం ఎన్నికల ప్రచార సభ దుస్థితి. పద్నాలుగు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసి.. జాతీయ, ప్రాంతీయ పార్టీల కూటమి కట్టిన చంద్రబాబునాయుడు చీపురుపల్లి వస్తే జనం లేక ఆయనే కాసేపు వెయిట్ చేయాల్సివచ్చింది. గురువారం సాయంత్రం పట్టణంలోని వంశీ విష్ణు థియేటర్ సెంటర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు చంద్రబాబు ప్రజాగళం సభ ఏర్పాటు చేశారు. చంద్రబాబు 4.05 గంటలకు హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అప్పటికి కనీసం ఐదువేల మంది కూడా లేకపోవడంతో స్థానిక టీడీపీ నాయకులు టెన్షన్ పడ్డారు. చంద్రబాబు కాసేపు వెయిట్ చేసి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అయితే టీడీపీ అధినేత మాట్లాడుతుండగానే.. ప్రజలు లేచి వెళ్లిపోయారు. రొటీన్ స్పీచ్ కావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి కూడా పెద్దగా స్పందన రాలేదు.


చంద్రబాబు సభకు అరకొరగా హాజరైన ప్రజలు

క్లుప్తంగా

బొబ్బిలి ప్రజలకు వైద్య భరోసా



బొబ్బిలి ప్రజలకు నాటి వైఎస్సార్, నేటి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యభరోసా కల్పించారు. పట్టణంలో మాతా శిశు ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రూ.42 లక్షల ఖర్చుతో 2007లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి మతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని (సీమాంక్ సెంటర్) నిర్మించి ప్రారంభించారు. ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నాడు–నేడు కార్యక్రమంలో రూ.3.24 కోట్ల వ్యయంతో సామాజిక ఆస్పత్రి భవనాలను నిర్మించారు. ఆధునిక సదుపాయాలతో సుందరంగా తీర్చిదిద్దారు. నాటి వైఎస్సార్, నేటి జగన్‌మోహన్‌రెడ్డి కృషితోనే ప్రజలకు ఆరోగ్య భరోసా కలిగిందంటూ ఆస్పత్రికి వచ్చేవారంతా చెబుతారు. తండ్రీ కొడుకుల హయాంలో పక్కపక్కనే ఏర్పాటైన భవనాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి.

– బొబ్బిలి

సాలూరులో టీడీపీకి షాక్

200 మంది వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: పట్టణంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. పట్టణంలోని 28,29 వార్డుల కౌన్సిలర్లు, నాయకులు గొర్లె వెంకటరమణ, బలభద్రుని శ్రీనివాస రావు, జలుమూరి శ్రీనివాసరావు, పురిపండ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో యాతవీధికి చెందిన టి.రమణ, గౌరు, జి.పాపారావు, గణేష్, కె.ఎర్రయ్య, ఎం.రమణ, సీహెచ్ రాము తదితర సుమారు 70 కుటుంబాలకు 200 మంది టీడీపీని వీడి గురువారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ సాలూరు అసెంబ్లీ అభ్యర్థి పీడిక రాజన్నదొర వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అందరూ సమష్టిగా పనిచేసి వైఎస్సార్‌సీపీకి అఖండ మెజారిటీ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిదులు, నాయకులు పాల్గొన్నారు.

భంజ్‌దేవ్‌ను నమ్మని సంధ్యారాణి

- అనుమానపు చూపులు
- తన అనుచరులతో ఆయన కదలికలపై నిఘా
- దీనిపై మండిపడుతున్న భంజ్‌దేవ్ వర్గీయులు
- అవమానకరమంటూ ఆరోపణలు
- నాటి నుంచి నేటి వరకు సంధ్యారాణి నైజం అదే నంటూ విమర్శలు



సాలూరు: ఇద్దరూ టీడీపీ సీనియర్ నాయకులే. టికెట్ ఆశించిన వారే. అందులో సంధ్యారాణి టికెట్ దక్కించుకున్నారు. అప్పటి నుంచి మరో ఆశావహుడు, పార్టీ సీనియర్ నాయకుడు భంజ్‌దేవ్‌పై అనుమానం పెంచుకున్నారు. ఆయనకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకుండా అనుమానపు చూపులు చూస్తుండడం ప్రస్తుతం సాలూరు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ భంజ్‌దేవ్, ఆయన అనుచరులపై ప్రత్యేక నిఘా వేయడం, వారి కదలికలను పసిగడుతున్న సంధ్యారాణి తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెన్నుపోటు రాజకీయాలు నెరపడం సంధ్యారాణికి అలవాటని, ఆమెకు అందరూ ఆ విధంగానే కనిపిస్తున్నారంటూ టీడీపీలోని ఓ వర్గం మండిపడుతోంది. నమ్మని వ్యక్తుల కోసం పనిచేయడమంటే బురదలో పోసిన పన్నీరే అవుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఆది నుంచి ఆమె తీరు అంతే...

సంధ్యారాణి ఎమ్మెల్సీగా పనిచేసిన సమయంలోనూ ఈ ప్రాంతానికి ఏ మేలు చేయలేదు. ఏ నాయకుడు, కార్యకర్తకు అండగా నిలబడలేదు. ఆపదవేళ ఆదుకున్నదీ లేదని కొందరు టీడీపీ నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పుడు భంజ్‌దేవ్, ఆయన వర్గీయులను తొక్కిపెట్టడమే ప్రధాన అజెండాగా పనిచేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గతంలో భంజ్‌దేవ్ వర్గీయుడుగా పేరొందిన పాచిపెంట మండలాధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబును పార్టీ మండలాధ్య పదవి నుంచి తప్పించి ముఖీ సూర్యనారాయణకు ఇవ్వడం, దీనితో తీవ్రమనస్తాపానికి గురైన భంజ్‌దేవ్ పార్టీ అదిష్టానం వద్ద పట్టుబట్టి మరలా ప్రసాద్‌కు పార్టీ అధ్యక్ష పదవి కట్టబెట్టించారు. దీనిని మనసులో పెట్టుకున్న ఆమె.. అన్ని మండలాల్లోను పార్టీని రెండు వర్గాలుగా విభజించారు. పార్టీ కోసం కష్టపడే భంజ్‌దేవ్ వర్గీయులను పక్కనపెడుతూ తన వర్గానికి ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించారు. ఈ కోవలోనే మక్కువ మండల టీడీపీ నాయకుడు పెంట తిరుపతిరావుతో నేటికి విభేదాలు కొనసాగుతున్నాయన్నది టీడీపీ శ్రేణులే చెబుతున్నాయి. ఇలాంటి అభ్యర్థికి పొరపాటున ఓటు వేసినా, మద్దతు తెలిపినా మునిగిపోతామని ఆ పార్టీలోనే కొందరు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. గతంలో భంజ్‌దేవ్ ఓటమికి ఆమే కారణమన్న వాదనా వినిపిస్తోంది.

చివరికి భంజ్‌దేవ్‌ను, ఆయన అనుచరులను పార్టీకి శాశ్వతంగా దూరం చేయడమే అంతిమ లక్ష్యంగా సంధ్యారాణి పనిచేస్తోందన్న చర్చ సాగుతోంది. గెలవకముందే ఆమె వ్యవహార తీరు ఇలా ఉంటే... పొరపాటున గెలిస్తే భంజ్‌దేవ్ పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఆమె చేస్తున్న పనులన్నీ దీనికి మరింత బలం కూర్చుతున్నాయన్నది పార్టీ వర్గీయుల మాట.

విజయవంతంగా ముగిసిన పోస్టల్ బ్యాలెట్

- వినియోగించుకున్న ఉద్యోగులు 8053మంది

పార్వతీపురంటౌన్: సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల విధులు నిర్వహించనున్న ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఓటు కలిగి ఉండి జిల్లాలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు వారి సొంత నియోజకవర్గ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటుకు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగి జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి పార్వతీపురంలోని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఐదురోజుల్లో ఓటింగ్ ఇలా

జిల్లా వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా 8053 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా కురుపాం నియోజకవర్గంలో 2498 మంది, అత్యల్పంగా సాలూరు నియోజకవర్గంలో 1486 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో 2194 మంది, పాలకొండ నియోజకవర్గంలో 1875 మంది, ఇతర జిల్లాలో విధులు నిర్వహించిన 1638 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు.

హోమ్ ఓటింగ్‌లో 579 ఓట్లు నమోదు

వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు హోమ్ ఓటింగ్ విధానాన్ని కొత్తగా ప్రవేశపెట్టారు. జిల్లాలో 85 ఏళ్ల దాటిన వారు 3,900మంది ఉండగా 270మంది, 12,247మంది దివ్యాంగులు ఉండగా 383మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 579 మంది ఓటేశారు.

హోమ్ ఓటింగ్ ఇలా...

నియోజకవర్గం	పోలైన ఓట్లు
సాలూరు	163
పార్వతీపురం	270
కురుపాం	33
పాలకొండ	113

నియోజకవర్గం	తొలిరోజు	రెండవరోజు	మూడవరోజు	నాల్గవ రోజు	ఐదవ రోజు
పార్వతీపురం	1098	499	335	171	49
సాలూరు	546	561	211	89	79
కురుపాం	914	888	486	160	50
పాలకొండ	726	584	348	138	79
ఇతర జిల్లా ఓటింగ్	773	439	290	104	32

ప్రజాశీస్సులు

ప్రచార పర్వం

ఎన్నికల ప్రచారానికి ఇంటింటికీ వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రజాశీస్సులు లభిస్తున్నాయి. మహిళలందరూ హారతిచ్చి, విజయతిలకం దిద్దుతున్నారు. 59 నెలల్లోనే మా కుటుంబాలకు ఎంతో మేలు చేశారని.. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తామని మాట ఇస్తున్నారు. అభ్యర్థులతో కలిసి ప్రచారంలో పాల్గొంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి మేజర్ పంచాయతీ కొత్త అగ్రహారంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతిచ్చి ఆశీర్వదించారు. గెలుపు భరోసా కల్పించారు.



తెర్లాం మండలం డి.గదబవలసలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగికి అక్కడి మహిళలు హారతిచ్చి విజయతిలకం దిద్దారు. ఫ్యాన్ గుర్తుకే ఓటేస్తామని చెప్పారు.



గజపతినగరం మండలం ఎం.గుమడాం గ్రామంలో గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.



కొత్తవలస మండలం మంగళపాలెంకు ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకు మద్దతుగా ముందు నడిచారు.



డెంకాడ మండలం అమకాం గ్రామస్తులు నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు గజమాలతో స్వాగతం పలికారు. మీ వెంటనే మేమంతా అంటూ సుస్పష్టం చేశారు. గెలుపు భరోసా ఇచ్చారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.